సాక్షి
రాజన్న సిరిసిల్ల

గురువారం । 19 । అక్టోబర్ । 2023

నందివాహనా.. నమోస్తుభ్యం



వేములవాడ: దేవి నవరాత్రోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి రాజన్న ఆలయంలోని స్వామి వారు నంది, గరత్మంతుల వాహనాలపై విహరించారు. ఏఈవో శ్రీనివాస్, పర్యవేక్షకులు తిరుపతిరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, స్థానాచార్యులు అప్పాల భీమాశంకర శర్మ, అర్చకులు, భక్తులు, పురప్రముఖులు పాల్గొన్నారు.



కూష్మాండ అలంకారం

వేములవాడ: రాజన్న ఆలయంలో నిర్వహిస్తున్న దేవీ నవరాత్రోత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారు కూష్మాండ అలంకారంలో దర్శనమిచ్చారు. అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు.

న్యూస్‌రీల్

జూడాలకు వైట్‌కోట్ సెర్మనీ



సిరిసిల్ల/సిరిసిల్లటౌన్: జిల్లా ప్రభుత్వ మెడికల్ కాలేజీలో బుధవారం వైట్‌కోట్ సెర్మనీ అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ జూనియర్ డాక్టర్స్ ఉన్నత లక్ష్యంతో చదివి నిరుపేదలకు సేవలందించాలని కోరారు. ఎంబీబీఎస్ విద్యార్థులకు తెల్లకోట్లు అందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పూసల సంఘం సమస్యలు పరిష్కరిస్తాం



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): గ్రామాల్లో సంచరిస్తూ వస్తువులు అమ్ముకొని జీవనోపాధి పొందుతున్న పూసల సంఘం సభ్యుల సమస్యలు పరిష్కరిస్తామని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేటలో బుధవారం పూసల సంఘం జిల్లా అధ్యక్షుడు ముద్రకోళ్ల ఆంజనేయులు ఆధ్వర్యంలో సంఘ సభ్యులు ఆగయ్యను కలిసి సమస్యలు విన్నవించారు. జిల్లా కేంద్రంలో సంఘం భవనానికి స్థలం కేటాయించాలని వినతిపత్రం అందించారు. ఆగయ్య మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉందని స్థలం కోసం ముందుగా కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వాలని సూచించారు. సంఘం మండల బాధ్యులు మద్దివేణి కృష్ణ, మద్దివేణి శ్రీధర్, మద్దివేణి లక్ష్మణ్, కోనేటి సతీశ్ పాల్గొన్నారు.

మన్నాన్‌కు జాతీయ కరాటే జడ్జిగా అర్హత



వేములవాడ: జాతీయ కరాటే పోటీలకు జడ్జిగా వ్యవహరించేందుకు వేములవాడకు చెందిన ఎంఏ మన్నాన్ జడ్జి–ఏగా అర్హత సాధించారు. ఈమేరకు బుధవారం కరాటే అసోసియేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి షిహాన్ రజనీశ్‌చౌదరి చేతుల మీదుగా సర్టిఫికెట్ అందుకున్నారు. తెలంగాణ రిఫరీ కమిషన్ చైర్మన్ సెన్సాయ్ పాపయ్య, సురభి వేణుగోపాల్, గౌరు రాజిరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పి.నరేందర్, కోశాధికారి సాయికుమార్ పాల్గొన్నారు.

సువిధ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలి



సిరిసిల్ల: అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటించాలని సిరిసిల్ల ఆర్డీవో, ఓటరు నమోదు అధికారి ఎన్.ఆనందర్‌కుమార్ సూచించారు. సిరిసిల్ల ఆర్డీవో ఆఫీస్‌లో బుధవారం అన్ని పార్టీల నేతలతో సమావేశమయ్యారు. ఎన్నికల ప్రచారానికి అనుమతి తీసుకోవాలన్నారు. 15 అంశాలకు సంబంధించిన అనుమతులు సువిధ పోర్టల్ ద్వారా నేరుగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 18 ఏళ్లు నిండిన యువతీయువకులు ఓటర్లుగా నమోదయ్యేందుకు అక్టోబరు 31వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. వివిధ పార్టీల నాయకులు ఎస్.కైలాసకుమార్, కల్యాణచక్రవర్తి, తీగల శేఖర్ గౌడ్, మహమ్మద్ మైముద్దీన్, కరుణాకర్, కమలాకర్, డి.విజయకుమార్ పాల్గొన్నారు.

‘గంగుల’ అంటేనే ప్రత్యర్థులు జంకుతున్నారు!

- కాంగ్రెస్, బీజేపీ నేతలు పారిపోతున్నరు
- కాంగ్రెస్, బీజేపీలను దరిదాపుల్లోకి రానివ్వద్దు
- ఆంధ్రా నాయకులొస్తున్నారు జాగ్రత్త
- బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్



మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

సాక్షిప్రతినిధి, కరీంనగర్/కరీంనగర్: మంత్రి కమలాకరన్నపై పోటీ చేసేందుకు అందరూ జంకుతున్నారని, కాంగ్రెస్ వాళ్లు హుస్నాబాద్ పారిపోయారని, బీజేపీ వాళ్లు పోటీకి వెనకాముందు ఆడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ఎద్దేవా చేశారు. గంగుల మీద పోటీ అంటే పోచమ్మ గుడి ముందు పొట్టేలు కట్టేసినట్లేనన్నారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం కరీంనగర్‌లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో జరిగిన ‘ప్రజా ఆశీర్వాద’ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కేటీఆర్ మాట్లాడుతూ.. కరీంనగర్‌లో గంగుల విజయం ఖాయమని స్పష్టం చేశారు. బీజేపీ నుంచి ఎంపీ అయిన బండి సంజయ్ ఐదేళ్లలో చేసింది శూన్యమని, హిందూ ముస్లింల మధ్య తగాదాలు సృష్టించి లబ్ధి పొందడమే ఆయన నైజమని ధ్వజమెత్తారు. మంత్రి కమలాకర్ ఆధ్వర్యంలో సంక్షేమం, అభివృద్ధి, గురుకులాలతో విద్యారంగం దూసుకుపోతుందన్నారు. కమలాకర్ చేతిలో చావుదెబ్బ తిని బండి సంజయ్ ఏడుపుతో ఎంపీ అయ్యాక నయా పైసా అభివృద్ధి చేసిన దాఖలాల్లేవని అన్నారు. మోడీ దేవుడంటున్న బండి సంజయ్ రాష్ట్రానికి బడి తెచ్చాడా? గుడి తెచ్చాడా? అని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ గొప్ప హిందువని, ఆయన చేసిన యాగాలు, యజ్ఞాలు ఎవరూ చేయలేదని స్పష్టం చేశారు. ప్రజా నాయకులు హిందూ, ముస్లిం ఐక్యత కోరుకోవాలే తప్ప.. విభజించి పాలించి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని హితవు పలికారు. కాంగ్రెస్, బీజేపీలతో ఒరిగిందేమి లేదని, మరోసారి నమ్మితే 50 ఏళ్లు వెనక్కి వెళ్లాల్సి వస్తుందని గతాన్ని గుర్తు చేశారు. సీఎం కేసీఆర్ సారథ్యంలో పదేళ్లల్లో అభివృద్ధి, సంక్షేమంలో దేశంలోనే ముందున్నామని, కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో ఎన్నో మార్పులు వచ్చాయని అన్నారు. పదేళ్లలోనే గణనీయమైన అభివృద్ధి జరిగిందని, గతంలో నీళ్ల కోసం జగడాలు ఉండేవని, ప్రస్తుతం ఆ పరిస్థితి లేదని, కాళేశ్వరం జలాలతో తెలంగాణ సజీవ జలధారగా మారిందని అన్నారు. తెలంగాణ కోసం చావు నోట్లో తలపెట్టిన కేసీఆర్ కావాలో.. తెలంగాణ కోసం రాజీనామాలు చేయకుండా పారిపోయిన కిషన్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి కావాలో ప్రజలు గుండెలపై చేయి వేసుకొని ఆలోచించి అభివృద్ధికి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో సన్నబియ్యం పథకం అమలు చేయబోతున్నామని, 15 లక్షల పరిమితితో కేసీఆర్ ఆరోగ్య రక్ష పథకంతో పాటు ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన హామీలన్నింటినీ దశలవారీగా అమలు చేయబోతున్నామని, మరోసారి బీఆర్ఎస్‌ను అధికారంలోకి తెచ్చేందుకు అన్ని వర్గాల ప్రజలు బాసటగా నిలవాలని పిలుపునిచ్చారు.

ఆశీర్వదించండి.. చేతులు బలోపేతం చేయండి..

కౌన్సిలర్‌గా, కార్పొరేటర్‌గా, ఎమ్మెల్యేగా, మంత్రిగా పని చేసినా మనసు మారలేదు.. మనిషిని మారలేదు.. రాజకీయ జీవితంలో ఏ తప్పు చేయలేదు.. మరోసారి ఆశీర్వదించండి.. నా చేతులు బలోపేతం చేయండి.. అభివృద్ధి కోసం మరిన్ని నిధులు తీసుకొస్తానని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి, కరీంనగర్ అసెంబ్లీ బీఆర్ఎస్ అభ్యర్థి గంగుల కమలాకర్ అన్నారు. కాంగ్రెస్, బీజేపీ రెండు ఒక్కటేనని, వారు ఢిల్లీలో కలుసుకుంటారని, కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను మళ్లీ ఆంధ్రాలో కలిపేందుకు కుటిల ప్రయత్నాలకు తెరలేపారని ఆరోపించారు. కేవీపీ, షర్మిలమ్మ, కిరణ్‌కుమార్‌రెడ్డి హైదరాబాద్ కేంద్రంగా బీజేపీ, కాంగ్రెస్ బలోపేతానికి ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. 1956లో తెలంగాణను ఆంధ్రాలో విలీనం చేస్తే 50 ఏళ్లు గోస పడ్డామని, మరోసారి ఆ రెండు పార్టీలను నమ్మితే తెలంగాణను ఆంధ్రాలో కలిపేందుకు మనమే తావిచ్చినవారమవుతామని అన్నారు. ఢిల్లీ పార్టీల చేతుల్లో తెలంగాణను బంధీ చేయొద్దని, సీఎం కేసీఆర్, కేటీఆర్ చేతుల్లో తెలంగాణను పెట్టి అభివృద్ధి చేసుకుందామని స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఓట్ల కోసం చేసే జిమ్మిక్కులను నమ్మొద్దని, తస్మాత్ జాగ్రత్త అంటూ సూచించారు. కరీంనగర్ పట్టణాన్ని పదేళ్లలోనే 300 కోట్లతో అభివృద్ధి చేశానని, హైదరాబాద్ తరువాత రెండో గొప్ప నగరంగా కరీంనగర్ అభివృద్ధి చెందిందని అన్నారు. స్మార్ట్ సిటీతో నగర సుందరీకరణ, ఐటీ టవర్, తీగల వంతెన, మానేరు రివర్ ఫ్రంట్, టీటీడీ ఆలయ నిర్మాణం, ఇస్కాన్ టెంపుల్, మెడికల్ కళాశాలతో పాటు ఎన్నో అభివృద్ధి పనులు చేశానని గుర్తు చేశారు. 15 ఏళ్లుగా ఎమ్మెల్యేగా, మంత్రిగా ఏనాడూ ఏ తప్పు చేయలేదని, ప్రజల మధ్యలో ఉన్న తనను ఆశీర్వదించి కొండంత అండగా ఉండాలని, రానున్న ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయిన్‌పల్లి వినోద్‌కుమార్, నగర మేయర్ వై.సునీల్‌రావు మాట్లాడారు. ప్రజా ఆశీర్వాద సభలో ఎమ్మెల్యేలు సుంకె రవిశంకర్, రసమయి బాలకిషన్, ఎమ్మెల్సీలు ఎల్.రమణ, భానుప్రసాద్‌రావు, జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, కార్పొరేషన్ చైర్మన్లు సర్దార్ రవీందర్‌సింగ్, గెల్లు శ్రీనివాస్‌యాదవ్, కుర్మాచలం అనిల్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జీవీ రామకృష్ణారావు, డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణి, నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్, ఏఎంసీ చైర్మన్ రెడ్డవేని మధు, మాజీ ఎమ్మెల్యే కోడూరి సత్యనారాయణగౌడ్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావుతో పాటు ఎంపీపీలు, జెడ్పీటీసీలు, కార్పొరేటర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జంగ్ తెలంగాణ

నల్లసూరీలతో మాటాముచ్చట

- నేడు ఉమ్మడి జిల్లాలో ఏఐసీసీ నేత రాహుల్‌గాంధీ పర్యటన
- పెద్దపల్లిలో బహిరంగ సభ, కరీంనగర్‌లో పాదయాత్ర
- సెంటినరీకాలనీలో కార్మికులతో సమావేశం
- భద్రతను పర్యవేక్షిస్తున్న పోలీసులు



కొనసాగుతున్న ఏర్పాట్లు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్, సాక్షి, పెద్దపల్లి: ఏఐసీసీ అగ్రనేత, ఎంపీ రాహుల్‌గాంధీ గురువారం ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పర్యటించనున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా చేపట్టిన బస్సుయాత్ర రెండో రోజు పెద్దపల్లిలో కొనసాగనుంది. ఇందుకు సంబంధించి కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీ చైర్మన్ దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, టీపీసీసీ ఉపాధ్యక్షుడు విజయరమణారావుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. రాహుల్ గాంధీ పాల్గొనే కార్యక్రమాలకు జాతీయ, రాష్ట్ర నాయకత్వం తరలిరానున్న నేపథ్యంలో భద్రతను పోలీసులు పర్యవేక్షిస్తున్నారు.

మంథని–కరీంనగర్ పర్యటన ఇలా..

రాహుల్‌గాంధీ గురువారం ఉదయం భూపాలపల్లి జిల్లాలో పర్యటన ముగించుకొని బస్సులో పెద్దపల్లి జిల్లా మంథనిలో ప్రవేశించనున్నారు. అక్కడ కాంగ్రెస్ శ్రేణులు ఆయనకు పెద్ద ఎత్తున స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మంథనిలో రోడ్ షోలో పాల్గొన్న అనంతరం రామగిరి మండలంలో మధ్యాహ్నం రాష్ట్ర నాయకులతో కలిసి భోజనం చేస్తారు. తర్వాత సింగరేణి కార్మికులు, రైతులతో సమావేశమవుతారు. వారితో మాట్లాడాక బస్సులో కమాన్‌పూర్ చౌరస్తాకు చేరుకొని, రోడ్ షోలో పాల్గొంటారు. సబ్బితం నుంచి బైక్ ర్యాలీ ద్వారా పెద్దపల్లి బహిరంగ సభకు సాయంత్రం 4 గంటలకు చేరుకుంటారు. భారీ బహిరంగ సభ అనంతరం రాత్రి 7 గంటలకు కరీంనగర్ చేరుకొని, 10 గంటల వరకు పాదయాత్ర చేయనున్నారు. అక్కడే బస చేయనున్నారు.

40 వేల మందితో భారీ బహిరంగ సభ

పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని జూనియర్ కాలేజీ గ్రౌండ్‌లో బహిరంగ సభ కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. పెద్దపల్లి, మంథని, రామగుండం నియోజకవర్గాలకు చెందిన సుమారు 40 వేల మంది పాల్గొననున్నారు. సభా ప్రాంగణంలో భద్రత ఏర్పాట్లను రాహుల్‌గాంధీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, ఉన్నతాధికారులు, పెద్దపల్లి పోలీసులు పర్యవేక్షిస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు సభాస్థలిని పరిశీలించారు. కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఉమ్మడి కరీంనగర్‌పై ప్రత్యేక ఫోకస్

అసెంబ్లీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ముందుకెళ్తున్న కాంగ్రెస్ అధిష్ఠానం ఉమ్మడి కరీంనగర్‌పై ప్రత్యేక ఫోకస్ పెట్టింది. ఇప్పటికే ఏడుగురు అభ్యర్థులను ప్రకటించింది. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ ఉమ్మడి జిల్లాలో బస్సు యాత్ర చేపడుతుండటంతో కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. మొత్తం 13 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేసేలా అధిష్ఠానం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

ఓటేద్దాం.. రండి

- పాటల సీడీ ఆవిష్కరించిన కలెక్టర్



పాటల సీడీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్

సిరిసిల్ల: ‘ఓటేద్దాం.. రండి’ పాటల సీడీని కలెక్టర్ అనురాగ్ జయంతి బుధవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. జిల్లా సమాచార, పౌరసంబంధాల శాఖ రూపొందించిన ఈ పాటల సీడీ ద్వారా ప్రజల్లో అవగాహన కలిగించాలని సూచించారు. ప్రలోభాలకు లొంగకుండా ఓటుహక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. స్వీప్‌లో భాగంగా గడ్డం శ్రీనివాస్ రచించిన పాటలను గణేశ్ పాడారు. కొత్త ఓటర్లు ఈ నెల 31 వరకు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. డీపీఆర్వో మామిండ్ల దశరథం, అదనపు డీఆర్‌డీవో స్వీప్ నోడల్ అధికారి కూర నర్సింహులు ఉన్నారు.

తనిఖీలు పారదర్శకంగా నిర్వహించండి

ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో తనిఖీలను పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి కోరారు. కలెక్టరేట్‌లో బుధవారం సహాయ వ్యయ పరిశీలకులు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలతో సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ సెలవు రోజుల్లోనూ నిఘా పెంచి సాధారణ ప్రజలకు ఇబ్బందుల్లేకుండా తనిఖీలు చేయాలన్నారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తూ.. వీడియో చిత్రీకరించాలని సూచించారు. పట్టుబడిన నగదును సీజ్‌చేయాలని, రికార్డుల్లో నమోదుచేయాలని ఆదేశించారు. పట్టుబడిన వాటిని జప్తు చేస్తూ రశీదులు ఇవ్వాలన్నారు. రాత్రి సమయాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. మాస్టర్ ట్రైనర్ ఉపేందర్, జిల్లా ఆడిట్ అధికారి స్వప్న, డిప్యూటీ రిజిస్ట్రార్ రామకృష్ణ, ట్రైనింగ్ పర్యవేక్షకులు, సీపీవో శ్రీనివాసచారి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

సిరిసిల్లఅర్బన్: ఎన్నికల ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని కలెక్టర్, ఎన్నికల అధికారి అనురాగ్‌జయంతి సూచించారు. బుధవారం సమీకృత జిల్లా ఫిర్యాదుల కేంద్రం, మీడియాసెంటర్, సీవిజిల్, కంట్రోల్ రూమ్ 1950, సోషల్‌మీడియా ఫిర్యాదులను తనిఖీ చేశారు. అనురాగ్ జయంతి మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగడంలో ఫిర్యాదుల కేంద్రం, మీడియాసెంటర్ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఎన్నికల్లో ఓటర్లు ప్రలోభ పెడుతున్నట్లు ఫిర్యాదులు వచ్చిన, ఫేక్‌న్యూస్ ప్రసారమైన ఓటర్ల సందేహాల నివృత్తికి కేంద్రాలను సంప్రదించాలన్నారు. ఎన్నికల ఫిర్యాదులు ఉంటే 08723–293024 నంబర్‌ను సంప్రదించాలన్నారు. అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, డీపీఆర్వో మామిండ్ల దశరథం, జిల్లా కార్మిక అధికారి రఫీ, ఎస్సీ కార్పొరేషన్ అధికారి వినోద్ తదితరులు ఉన్నారు.

నిబంధనల మేరకే ప్రయాణించాలి

- ఎస్పీ అఖిల్‌మహాజన్



వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్పీ

వేములవాడ: సార్వత్రిక ఎన్నికలు సజావుగా సాగేందుకు ప్రజలు ఎన్నికల నియమావళి, నిబంధనల మేరకే ప్రయాణించాలని, తనిఖీ అధికారులకు సహకరించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ కోరారు. స్థానిక పాపన్నచౌక్‌లో డీఎస్పీ నాగేంద్రచారితో కలసి వాహనాలు తనిఖీ చేశారు. ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ జిల్లాలో ఐదు చెక్‌పోస్టుల తోపాటు ఐదు టీమ్స్‌తో తనిఖీలు చేయిస్తున్నట్లు తెలిపారు. అక్రమంగా నగదు, మద్యం, మాదకద్రవ్యాల రవాణాను అరికట్టేందుకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సీఐ కరుణాకర్, ఆర్ఎస్సై శ్రవణ్, సిబ్బంది ఉన్నారు.

బీఫామ్ అందుకున్న ‘చల్మెడ’



వేములవాడ: వేములవాడ బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు బుధవారం సీఎం కేసీఆర్ చేతులమీదుగా బీఫామ్ అందుకున్నారు. ఈ సందర్భంగా చల్మెడ మాట్లాడుతూ తనపై విశ్వాసంతో పార్టీ టికెట్ ఇచ్చి ఆశీర్వదించిన సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల నమ్మకానికి అనుగుణంగా పార్టీ క్యాడర్‌ను కలుపుకుని ప్రజల సహకారంతో భారీ మెజారిటీతో గెలిచి వస్తానని పేర్కొన్నారు. ఇప్పటికే వేములవాడ నియోజవర్గంలో ఎమ్మెల్యే రమేశ్ బాబు ఆధ్వర్యంలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరిగాయనీ, మిగిలిన అభివృద్ధి పనులు రాబోయే ప్రభుత్వంలో తప్పకుండా చేస్తామన్నారు.

భక్తిశ్రద్ధలతో మహా చండీయాగం



ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని పోతుగల్‌లో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీదుర్గ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం మహా చండీయాగం నిర్వహించారు. మునుగోటి హరిచరణ్‌శర్మ, శివరామచరణ్‌శర్మ ఆధ్వర్యంలో మహా చండీయాగం నిర్వహించారు. భక్తులకు కోల సతీశ్ గౌడ్ అన్నదానం చేశారు. సర్పంచ్ గౌతంరావు, ఉపసర్పంచ్ మంజుల, కమిటీ సభ్యులు గోద శ్రీనివాస్, వరి వెంకటేశ్, బంగ్ల శ్రీను, మ్యాన రాజేశ్, మధు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్‌లో ట్రెయినీ అధికారులు



అధికారులను సన్మానిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని రాచర్ల బొప్పాపూర్‌కు ఐదు రోజుల స్టడీటూర్‌కు వచ్చిన ట్రెయినీ అధికారులు బుధవారం స్థానిక వ్యవసాయమార్కెట్‌ను పరిశీలించారు. వ్యవసాయ ఉత్పత్తుల సేకరణ, విక్రయాల గురించి తెలుసుకున్నారు. స్థానిక రోగ్య ఉపకేంద్రంలో ప్రజలకు అందుతున్న వైద్యసేవల గురించి తెలుసుకున్నారు. గ్రంథాలయం, మహిళా సంఘ భవనాలను పరిశీలించారు. ట్రెయినీ అధికారులు రాహుల్‌సింగ్, శుభంసింగ్, రవికుమార్‌మీనా, అమిత్‌నితిన్ ఉన్నారు. ఏఎంసీ చైర్మన్ ఎలుసాని మోహన్‌కుమార్, సర్పంచ్ కొండాపురం బాల్‌రెడ్డి, ఏవో భూంరెడ్డి, మెడికల్ ఆఫీసర్ స్రవంతి, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్‌గా అన్సార్



సిరిసిల్ల: సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్‌గా టౌన్ ప్లానింగ్ అధికారి ఎస్.కె.అన్సార్‌కు అదనపు బాధ్యతలు ఇస్తూ కలెక్టర్ అనురాగ్ జయంతి బుధవారం ఆదేశాలు జారీ చేశారు. మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న మహమ్మద్ ఆయాజ్ అనారోగ్య కారణాలతో రెండు నెలలపాటు వైద్య సెలవుల్లో వెళ్లారు. దీంతో టౌన్‌ప్లానింగ్ అధికారిగా ఉన్న అన్సార్‌కు మున్సిపల్ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈమేరకు అన్సార్ బాధ్యతలు స్వీకరించారు.

ఆరు గ్యారంటీలతో ప్రచారం

- రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే
- సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి మహేందర్‌రెడ్డి



కండువాలు కప్పుతున్న మహేందర్‌రెడ్డి

వీర్నపల్లి(సిరిసిల్ల): కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలపై ప్రజల్లో ఆత్మవిశ్వాసం కలిగిందని, రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టనున్నారని ఆ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కె.కె.మహేందర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని శాంతినగర్, సీతారాం నాయక్‌తండా, జవహర్‌లాల్‌నాయక్‌తండా, లాల్‌సింగ్‌తండా, కంచర్ల గ్రామాల్లో బుధవారం గడపగడపకు కాంగ్రెస్ ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. తెలంగాణ వస్తే ప్రజలు బాగుపడుతారని ఆశిస్తే.. కేసీఆర్ కుటుంబం మాత్రమే బాగుపడిందన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం జరిగిన ఉద్యమం జరిగితే.. నేడు నీళ్లు గజ్వేల్‌కు, నిధులు బీఆర్ఎస్ నాయకుల జేబుల్లోకి, నియామకాలు కేసీఆర్ కుటుంబానికి చేరాయన్నారు. ఈ సందర్భంగా ఐదు గ్రామాల నుంచి దాదాపుగా 250 మంది వరకు కాంగ్రెస్‌లో చేరారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు హరిలాల్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు భూత శ్రీనివాస్, మండల మహిళా అధ్యక్షురాలు జోగుల మంజుల, లెంకల లక్ష్మణ్, కాంతయ్య, రాములు, రాజు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కే పట్టాభిషేకం

- పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం



బోయినపల్లిలో మహిళల మంగళహారతులు

బోయినపల్లి(చొప్పదండి): రాష్ట్రంలో కాంగ్రెస్ గాలి వీస్తోందని, రానున్న ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి కట్టం కడతారని ఆ పార్టీ చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. బోయినపల్లిలో బుధవారం రాత్రి గడపగడపకు కాంగ్రెస్ – పల్లె పల్లెకు సత్యమన్న కార్యక్రమం నిర్వహించారు. సత్యం మాట్లాడుతూ రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు గ్యారంటీ పథకాలతో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, ఏనుగుల కనకయ్య, కట్ట లచ్చయ్య, పులి లక్ష్మీపతి, ఎంపీటీసీ ఉయ్యాల శ్రీనివాస్, బోయిని ఎల్లేశ్, పిట్టల మోహన్, గుంటి జలేందర్, నాగుల వంశీ, కొడగాని వెంకటేశ్, నిమ్మ వినోద్‌రెడ్డి, నాగుల వంశీ, నక్క శ్రీకాంత్, బొజ్జ మహేందర్, దూస జానర్దన్, భూమయ్య తదితరులు ఉన్నారు.

వెంకన్న క్షేత్రం.. బ్రహ్మోత్సవ శోభితం

- అలలారుతున్న 'శ్రీశాల' తిరువీధులు
- కొలిచిన వెంటనే కోర్కెలు తీర్చే దైవం
- శనివారం నుంచి బ్రహ్మోత్సవాలు
- 23న కల్యాణోత్సవం, 28న రథోత్సవం
- సిరిసిల్ల వెంకన్న క్షేత్రంలో అట్టహాసంగా వేడుకలు

'అశేషభక్త వంధ్యాయ వజ్రదంతి స్థితాయచ!
శ్రీశాల పురవాసాయ శ్రీనివాసయతే నమః'..

ఇది తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) అనుబంధ ఆలయంగా వెలుగొందుతున్న సిరిసిల్ల వెంకటన్న క్షేత్ర ఆలయ ప్రాశస్త్యాన్ని తెలిపే స్తోత్రం. పూర్వకాలంలో తిరుపతి వెళ్లలేని భక్తులు ఈ ఆలయాన్ని సందర్శిస్తే అక్కడికి వెళ్లిన పుణ్యం దక్కుతుందని విశ్వాసం. ఈక్రమంలో ఇక్కడ కూడా దేవదేవునికి పన్నెండు రోజులపాటు బ్రహ్మోత్సవాలు నిర్వహించడం వందల ఏళ్లుగా వస్తుంది. శ్రీశాల క్షేత్రంలో శనివారం బ్రహ్మోత్సవాలు ప్రారంభంకానున్న నేపథ్యంలో ప్రత్యేక కథనం.

– సిరిసిల్లటౌన్


సిరిసిల్లలో కొలువుదీరిన శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి

సిరిసిల్ల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆశ్వయుజ శుద్ధ సప్తమి నుంచి బహుళ విదియ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఈఏడాది అక్టోబర్ 21 నుంచి 12 వరకు పన్నెండు రోజులపాటు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఏటా సుమారు లక్షమందికి పైగా భక్తులు ఉత్సవాలలో పాల్గొని స్వామివారిని దర్శించుకుంటారు. దీంతో తిరువీధులు భక్తులతో కిటకిటలాడుతాయి.

ఆలయ ప్రాశస్త్యం

800 ఏళ్ల క్రితమే శ్రీశాల క్షేత్రంలో కేశవనాథుని ఆలయం నిర్మితమైందని పురాణాలు చెబుతున్నాయి. కాకతీయుల కాలంలో మొగలాయిలు హిందూ ఆలయాలపై విధ్వంసాలు చేస్తూ ఇక్కడి మూలవిరాట్టును పగులగొట్టారు. ఆ విగ్రహం ఇప్పటికీ ఆలయంలోని వాహనశాలలో భద్రంగా ఉంది. ఈ ఘటనపై ప్రజలు బాధపడుతుండగా కొన్నేళ్లకు సిరిసిల్లను పాలిస్తున్న సర్‌దేశాయ్ చెన్నమనేని వంశస్తులు తుక్కారావు, మీనారావులకు కలలో స్వామి కనిపించి మాండవ్య మహానది(మానేరు) ప్రాంతంలో బర్రెంకల చెట్టు కింద భూమిలో ఉన్న విగ్రహాన్ని ఆలయంలో ప్రతిష్ఠించాలని చెప్పి అంతర్థానమయ్యారని ప్రచారం. వెంటనే దేశాయ్‌లు ఆలయంలో విగ్రహాన్ని ప్రతిష్ఠింపజేసి వాహనాలు, పొన్నసేవ, రథాన్ని చేయించారు. అప్పటి నుంచి సిరిసిల్లలో ఏళ్లుగా బహ్మోత్సవాలు జరుగుతున్నాయి. బర్రెంకల వృక్షంకింద స్వామి ఉద్భవించడంతో ఈక్షేత్రం బర్రెంకల వేంకటేశ్వరస్వామిగా విరాజిల్లుతున్నారు. ఇక్కడి రథం తెలంగాణ జిల్లాల్లోని వేంకటేశ్వరస్వామి ఆలయాలలోనే పెద్దదిగా పేరొందింది. తిరుమలేశుని సన్నిధిలో మాదిరిగానే ఇక్కడ కూడా స్వామివారికి అన్ని రకాల వాహనాలు ఉండటం విశేషం.



బహ్మోత్సవాలకు ముస్తాబైన వెంకన్న ఆలయం

శ్రీవారి వాహనోత్సవాలు ఇలా..

సిరిసిల్ల వెంకన్న ఆలయంలో శనివారం ఉదయం 9 గంటలకు స్వపన తిరుమంజనము(పులికాపు)తో మొదలై అక్టోబర్ 12వ తేదీ రాత్రి ఏకాంతసేవతో ముగుస్తాయి. ఈమేరకు ఆలయ కమిటీ, అధికారులు, అర్చకులు ఏర్పాట్లను పూర్తి చేశారు. అక్టోబర్ 1న ఉదయం 9 గంటలకు పులికాపు, రాత్రి 7 గంటలకు పుణ్యాహవచనం, 22న ఉదయం అంకురారోపణం, ధ్వజారోహనం, అగ్నిప్రతిష్ఠ, రాత్రి 8 గంటలకు శేషవాహనం, 23న ఉదయం 11.15 గంటలకు కల్యాణోత్సవం, రాత్రి 8 గంటలకు హంసవాహనం, 24న 5 గంటలకు 9గంటలకు సింహవాహనం, సాయంత్రం 5గంటలకు అశ్వవాహనం(దసరా) వేడుకలు, రాత్రి 9 గంటలకు గజవాహనం, 25న ఉదయం 9 గంటలకు గరుడవాహనం, సాయంత్రం 4 గంటలకు కాళింగ మర్దనం, సాయంత్రం 6 గంటలకు సదస్సు, రాత్రి 8 గంటలకు హనుమంత వాహనం, 26న ఉదయం 9 గంటలకు సూర్య వాహనం, సాయంత్రం 5 గంటలకు రంగనాయక తిరుప్పోలం, రాత్రి 8 గంటలకు చంద్ర వాహనం, 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆండాళమ్మవారికి ఒడిబియ్యం, రాత్రి 8 గంటలకు పొన్నరథంపై శ్రీవారి ఊరేగింపు(పొన్నవాహనం), 28న శనివారం శ్రీవారి రథోత్సవం, ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రథంపై దర్శనం, అనంతరం తిరువీధుల్లో రథోత్సవం, 29 ఉదయం 8 గంటలకు హోమం, మహాపూర్ణాహుతి, ఉదయం 11 గంటలకు దోపుకథ, సాయంత్రం 4 గంటలకు చక్రతీర్థం, 30న ఉదయం 5 గంటలకు దేవతా ఉద్వాసన, గ్రామ బలి, రాత్రి 8 గంటలకు ఏకాంతసేవ నిర్వహించనున్నారు.

ఉత్సవాలకు అన్నీ సిద్ధం



కలెక్టర్ ఆదేశాలతో ఆలయాన్ని ఉత్సవాలకు సిద్ధం చేశాం. యాత్రికులకు సకల వసతులు కల్పించాం. 28న చంద్రగ్రహణం ఉండడంతో మధ్యాహ్నం 2 గంటలకే తిరువీధుల్లో రథోత్సవం నిర్వహిస్తాం. అన్ని శాఖల అధికారులు సహకరిస్తున్నారు. తిరుమలలో జరిగే బ్రహ్మోత్సవాల మాదిరిగా ఇక్కడ కూడా ఉత్సవాలు జరుగడం ఆనవాయితీగా వస్తుంది.

– మారుతిరావు, ఆలయ ఈవో

క్లుప్తంగా

22న జిల్లా కేంద్రానికి విశ్వరూప బస్సుయాత్ర


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్లలో అంబేద్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో విశ్వరూప బస్సు యాత్ర కరపత్రాలను బుధవారం ఆవిష్కరించారు. నవంబర్‌లో శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఈనెల 20 నుంచి బస్సు యాత్ర ప్రారంభిస్తున్నారని ఎమ్మార్పీఎస్ నాయకులు తెలిపారు. ఈనెల 22న జిల్లా కేంద్రానికి వచ్చే బస్సుయాత్రను విజయవంతం చేయాలని కోరారు. ఎంఎస్పీ జిల్లా ఇన్‌చార్జి ఆవునూరి ప్రభాకర్, జిల్లా కోఆర్డినేటర్ ఖానాపూర్ లక్ష్మణ్, ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ సంకపాక దామోదర్, భిక్షపతి, మధు, విజేందర్, మల్లేశం, దేవేందర్, ప్రభాకర్, రాజం, కల్యాణ్, నర్సయ్య ఉన్నారు.

అసెంబ్లీ ఎన్నికల్లో యువశక్తి చాటాలి


మాట్లాడుతున్న సంపత్

బోయినపల్లి(చొప్పదండి): రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో యువశక్తి ఏంటో బీఆర్ఎస్‌కు తెలిసేలా చేయాలని కరీంగనర్ జిల్లా బీజేవైఎం అధ్యక్షుడు సంపత్ కోరారు. బీజేవైఎం మండలాధ్యక్షుడు కొనుకటి హరీశ్ అధ్యక్షతన బుధవారం మండల పదాధికారుల సమావేశం నిర్వహించారు. సంపత్ మాట్లాడుతూ బీజేపీ యువమోర్చా నాయకులు గ్రామాల్లో తిరిగి ప్రధాని నరేంద్రమోదీ చేపడుతున్న ప్రజాసంక్షేమ పథకాలు ప్రజలకు వివరించాలని కోరారు. కొనుకటి హరీశ్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడవల్లి శిధర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గసభ్యుడు సమరసింహారెడ్డి, బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేటలో దొంగల బీభత్సం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండల కేంద్రంలో దొంగలు బీభత్సం సృష్టించారు. స్థానిక ఐవోబీ బ్యాంక్ ఏటీఎం మిషన్‌ను ధ్వంసం చేశారు. బ్యాంక్ సమయం దాటిన తర్వాత మూసివేసి సిబ్బంది వెళ్లిపోగా.. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత దొంగలు ఏటీఎంను ధ్వంసం చేసి చోరీకి యత్నించారు. బుధవారం బ్యాంక్ అధికారులు వచ్చి చూసే సరికి ఏటీఎంను ధ్వంసం చేసినట్లు గుర్తించారు. ఏటీఎం ధ్వంసంతో రూ.లక్ష నష్టం వాటిల్లినట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు. ఏటీఎంను ధ్వంసం చేసిన తర్వాత సమీపంలోని దుర్గమ్మ ఆలయం చొరబడి.. హుండీని ధ్వంసం చేసి రూ.3వేల నగదును ఎత్తుకెళ్లారు. ఏటీఎంలోని సీసీ ఫుటేజీల ఆధారంగా వేములవాడ మండలం నాంపల్లికి చెందిన అంకం బాలకృష్ణ అనే వ్యక్తి ఈ దొంగతనాలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. అతను కొంతకాలంగా ఎల్లారెడ్డిపేటలో అద్దె ఇంట్లో నివసిస్తున్నాడు. బాలకృష్ణను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా.. జడ్జి రిమాండ్ విధించారు. ఈమేరకు రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన అక్షయ

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని కనగర్తి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని అక్షయ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికై నట్లు వాలీబాల్ అకాడమీ కరీంనగర్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ చెన్నమనేని శ్రీకుమార్ తెలిపారు. ఇల్లంతకుంటలో గత రెండు రోజులుగా నిర్వహించిన రాష్ట్రస్థాయి సెలక్షన్స్‌లో ప్రతిభ కనబర్చిన పులి అక్షయ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై నట్లు పేర్కొన్నారు. గురువారం నుంచి మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయిలో పోటీల్లో పాల్గొననుందన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన అక్షయను సెక్రెటరీ శ్రీకుమార్, డీవైఎస్‌వో రాందాస్, ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ ప్రభాకర్, సర్పంచ్ భారతి, హెచ్‌ఎం వినోద్‌కుమార్, పీఈటీ అజయ్‌కుమార్ అభినందించారు.

బీఎస్పీతోనే రాజ్యాధికారం

సిరిసిల్లఅర్బన్: బీఎస్పీతోనే బహుజనుల రాజ్యాధికారం సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి జక్కని సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధి పెద్దూరులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో బీఎస్పీ సిరిసిల్ల అసెంబ్లీ నియోజకవర్గ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం జిల్లా అధ్యక్షుడు వర్దవెల్లి స్వామిగౌడ్ అధ్యక్షతన బుధవారం జరిగింది. సంజయ్‌కుమార్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో బీఎస్పీ నుంచి బీసీవర్గాల అభ్యర్థులను అసెంబ్లీకి పంపాలని కోరారు. బీఎస్పీతోనే రాజ్యాధికారం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా ఇసుక, ల్యాండ్, మెడికల్ మాఫియాలతో కొందరు వేల కోట్లు కొల్లగొడుతున్నారని ఆరోపించారు. బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి అంకని భాను, రాష్ట్ర నాయకులు పిట్టల భూమేశ్ తదితరులు పాల్గొన్నారు.

జల్సాలకు అలవాటు పడి.. దొంగతనాలు చేసి

- పట్టుబడిన అంతర్ జిల్లా దొంగల ముఠా


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం: జల్సాలకు అలవాటుపడిన వారు.. దొంగతనాలు చేయడం మొదలెట్టారు. ఏకంగా అంతర్‌జిల్లా దొంగలముఠాగా ఏర్పడి వరుస దొంగతనాలతో బెంబేలెత్తించిన ముఠాను రాజన్నసిరిసిల్ల జిల్లా పోలీసులు పట్టుకొని జైలుకు పంపారు. వారి నుంచి సుమారు రూ.12 లక్షల విలువైన 20.5 తులాల బంగారు ఆభరణాలు, 43 తులాల వెండి అభరణాలు, రెండు బైక్స్, దొంగతనం చేసేందుకు వాడే ఐరన్‌రాడ్, కట్టర్, స్క్రూ డ్రైవర్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఎస్పీ అఖిల్ మహాజన్ వివరాలు వెల్లడించారు. పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం రామారావుపల్లికు చెందిన రామటంకి సారయ్య, భూతం రాములు ముఠాగా ఏర్పడి పలు జిల్లాల్లో దొంగతనాలకు పాల్పడ్డారు. దాదాపు పదేళ్లుగా దొంగతనాలు చేస్తూ ఇప్పటికే జైలుకు వెళ్లి వచ్చారు. 2012 నుంచి 2016 వరకు బసంత్‌నగర్, కోనరావుపేట, తంగళ్లపల్లి, చిగురుమామిడి, చొప్పదండి, రామడుగు, మానకొండూరులో పలు దొంగతనాలు చేయగా 2017 సంవత్సరంలో పీడీయాక్ట్ నమోదైనట్లు వివరించారు. 2019లో జైలు నుంచి బయటకు వచ్చి జమ్మూకాశ్మీర్ వెళ్లి ఆ తర్వాత కరీంనగర్ వచ్చి కోళ్ల ఫాంలో కోళ్ల దొంగతనాలు చేయగా అరెస్టు చేసి పీడీయాక్ట్ పెట్టి పది నెలలు జైల్లో ఉన్నట్లు వివరించారు. 2022లో జైలు నుంచి బయటకొచ్చిన తర్వాత జగిత్యాల జిల్లాలో అద్దె గదిలో ఉంటూ హెల్మెట్లు, అద్దాలు, రెక్సిన్ పనిచేసుకుంటున్నాడు. ఇలా వచ్చిన ఆదాయం అతని జల్సాలకు సరిపోక తన గ్రామస్తుడు భూతం రాములు దగ్గరికి వెళ్లి దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నారు. ఇలా సెప్టెంబర్ 27న ఇద్దరు కలిసి బస్సులో మెట్‌పల్లి వెళ్లి అక్కడ ఓ మోటార్‌సైకిల్‌ను ఎత్తుకొచ్చారు. అదే బైక్‌పై సిరిసిల్లకు వచ్చారు. అక్కడ నుంచి ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేట, కిష్టునాయక్ తండాలో, సెప్టెంబర్ 14న చందుర్తి మండలం గోసుకలపల్లిలో, సెప్టెంబర్ 23న మల్యాలలో, అదే రోజున జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం వర్షకొండలో, అక్టోబర్ 5న కమలాపూర్ మండలం కన్నూరులో, పెద్దపల్లి జిల్లా 8 ఇంక్లయిన్‌కాలనీ, పోతనకాలనీలో దొంగతనాలకు పాల్పడ్డారు. మూడపల్లికి చెందిన హన్మండ్లు, మాల్యాలకు చెందిన రాజయ్య ఫిర్యాదుతో చందుర్తి సీఐ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో స్పెషల్ టీమ్ ఏర్పాటు చేసి దర్యాప్తులో చేపట్టారు. ఈక్రమంలో ఈనెల 16న వేములవాడ నందికమాన్ వద్ద సంచరిస్తున్నట్లు సమాచారం అందడంతో చందుర్తి ఎస్సై అశోక్ నిందితులను చాకచక్యంగా పట్టుకున్నారు. దొంగలను పట్టుకోవడంలో చురుకుగా వ్యవహరించిన డీఎస్పీ నాగేంద్రచారిని, చందుర్తి సీఐ కిరణ్‌కుమార్‌ను చందుర్తి ఎస్సై సిరిసిల్ల అశోక్, కానిస్టేబుల్స్ సతీశ్‌ప్రమోద్‌ను ఎస్పీ అఖిల్ మహాజన్ అభినందించారు.

మాజీ సర్పంచ్‌ల డిమాండ్లు నెరవేర్చాలి

- టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి మాజీ సర్పంచ్‌ల వినతి


వినతిపత్రం అందిస్తున్న ప్రతినిధులు

సిరిసిల్ల: మాజీ సర్పంచుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి మాజీ సర్పంచ్‌ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొడ్డు దేవయ్య బుధవారం వినతిపత్రం అందించారు. మాజీ సర్పంచులకు రూ.10వేల పెన్షన్, హెల్త్‌కార్డులు, ఉచిత బస్‌పాసులు అందించాలని, అర్హులకు మూడెకరాల భూమి కేటాయించాలని, జిల్లా కేంద్రంలో విశ్రాంతి భవనం నిర్మించాలని కోరారు. ఈమేరకు రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. మాజీ సర్పంచ్‌ల సమస్యలను మేనిఫెస్టోలో పెట్టాలని కోరారు. భూమన్నయాదవ్, ఏరెడ్డి మల్లారెడ్డి, సంపునూరి మల్లేశంగౌడ్, గుర్రం భూపతిరెడ్డి, మచ్చ నారాయణ, రఘు, మల్లికార్జునరావు, బుర్ర మల్లేశంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావాలని పాదయాత్ర



ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి(సిరిసిల్ల): బీఆర్ఎస్ పార్టీ మూడో సారి అధికారంలోకి రావాలని కోరుతూ వీర్నపల్లి మండలం గర్జనపల్లికి చెందిన అజ్మీరా నవీన్‌నాయక్ చేపట్టిన పాదయాత్ర బుధవారం ఎల్లారెడ్డిపేటకు చేరింది. స్థానిక నాయకులు నవీన్‌నాయక్‌ను కలిసి తమ స్వాగతం తెలిపారు. నవీన్‌నాయక్ డిగ్రీ వరకు చదువుకున్నాడు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మళ్లీ ఈ ఎన్నికల్లో గెలుపొంది.. కేసీఆర్ మళ్లీ సీఎం కావాలని ఆకాంక్షిస్తూ పార్టీ జెండాతో గర్జనపల్లి నుంచి హైదరాబాద్‌లోని ప్రగతిభవన్‌కు పాదయాత్ర చేపట్టాడు. బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు బండారి బాల్‌రెడ్డి, గుండారపు కృష్ణారెడ్డి, నర్సింహారెడ్డి స్వాగతం పలికారు.

హామీల అమలులో సర్కారు విఫలం

గంభీరావుపేట(సిరిసిల్ల): గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మేకల కమలాకర్ కోరారు. గంభీరావుపేటతోపాటు మల్లారెడ్డిపేట, లింగన్నపేటల్లో పార్టీ అసెంబ్లీ అభ్యర్థి కటకం మృత్యుంజయం తరఫున బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ప్రజలను మభ్యపెట్టే పార్టీలకు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. నియామకాలు లేక నిరుద్యోగుల ఆత్మహత్యలు చేసుకుంటున్నా ప్రభుత్వానికి కనువిప్పు కలగడం లేదన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్‌లు దేవరాజు, నల్ల రాజ్‌కుమార్, ప్రకాశ్‌గౌడ్, నాయకులు బాలయ్య, వంశీ, వేశాల వెంకటి, గంధ్యాడపు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఉపాధిహామీ అమలు చేయాలి

- అదనపు డీఆర్‌డీవో మదన్‌మోహన్
- రూ.1.05 లక్షల రికవరీ
- ముస్తాబాద్‌లో సామాజిక తనిఖీ వేదిక


మస్టర్లు పరిశీలిస్తున్న అదనపు డీఆర్‌డీవో

ముస్తాబాద్(సిరిసిల్ల): ఉపాధిహామీ పనులను పారదర్శకంగా చేపట్టాలని అదనపు డీఆర్‌డీవో మదన్‌మోహన్ సూచించారు. పనిదినాలు పెంచి కూలీలకు పనులు కల్పించాలన్నారు. జూలై 2021–మార్చి 2023 వరకు జరిగిన ఉపాధిహామీ పనులపై ముస్తాబాద్ మండల పరిషత్‌లో బుధవారం సామాజిక తనిఖీ సమావేశం నిర్వహించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో సమావేశ మందిరంలో సామాజిక తనిఖీ చేపట్టారు. నామాపూర్‌లో కూరగాయల పందిరి క్షేత్రస్థాయిలో లేనందున రూ.84వేలు రికవరీకి ఆదేశించారు. పలువురు పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లకు రూ.21వేల జరిమానాలు విధించారు. పలు గ్రామాల్లో మస్టర్ రోల్ సరిగా నిర్వహించడం లేదని, కూలీల సంతకాలు లేకుండా రికార్డులు చేస్తున్నారని తెలిపారు. మొక్కలు నూరు శాతం బతికేలా చూడాలని ఆదేశించారు. కూలీలకు సకాలంలో వేతనాలు రావడం లేదని తనిఖీ బృందం తెలిపింది. 21 నెలల అనంతరం చేపట్టిన సామాజిక తనిఖీ మొత్తం మీద సవ్యంగా సాగింది. అసిస్టెంట్ విజిలెన్స్ ఆఫీసర్ రామారావు, ఎంపీడీవో రమాదేవి, ఏపీవో ఆనంద్, జేఈఈ రాజనర్సు, ఎస్ఆర్‌పీ రాఘవులు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కేటీఆర్‌పై ప్రేమను చాటారు


ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న తోట ఆగయ్య

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన బీఆర్ఎస్ ఆశీర్వాద సభకు ప్రజలు పోటెత్తి వచ్చి మంత్రి కేటీఆర్‌పై సంపూర్ణ అభిమానాన్ని చాటారని పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పేర్కొన్నారు. బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. బీజేపీకి రాష్ట్ర అభివృద్ధి కాంక్ష లేదని, కాంగ్రెస్‌కు ఓట్లు అడిగే హక్కులేదన్నారు. అభివృద్ధికి ప్రజలు పట్టం కట్టారని బీఆర్ఎస్ ఆశీర్వాద సభకు కేటీఆర్ విజయోత్సవ సభగా మార్చారన్నారు. రానున్న ఎన్నికల్లో తమ పార్టీ అధినేత కేసీఆర్‌ను ప్రజలు మూడోసారి సీఎం చేయడానికి కృతనిశ్చయంతో ఉన్నారని సంతోషం వ్యక్తం చేశారు. సభను సక్సెస్ చేసిన పార్టీ అభిమానులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. టీఎస్‌పీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, ఆర్‌బీఎస్ చైర్మన్ గడ్డం నర్సయ్య, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, మున్సిపల్ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, నాయకుడు బొల్లి రామ్మోహన్, జెడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, అగ్గి రాములు, అన్నారం శ్రీనివాస్ ఉన్నారు.

సమష్టి కృషితోనే సభ సక్సెస్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయడానికి కృషి చేసిన బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్యను ఎల్లారెడ్డిపేటలో ఆ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు బుధవారం సన్మానించారు. సీఎం కేసీఆర్ సభలో మూడుసార్లు ఆగయ్య పేరును ప్రస్తావించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఆగయ్య మాట్లాడుతూ ఆశీర్వాద సభను సక్సెస్ చేయడంలో అందరి పాత్ర ఉందన్నారు. అన్ని స్థాయిల్లోని నాయకులు, పార్టీ కార్యకర్తలు కష్టపడితేనే రానున్న ఎన్నికల్లో భారీ మెజార్టీ సాధించే అవకాశం ఉంటుందన్నారు. జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు వరుస కృష్ణహరి తదితరులు పాల్గొన్నారు.

కుల తీర్మానాలపై వ్యతిరేక గళం


నిరసన తెలుపుతున్న రెడ్డి సంఘం సభ్యులు

సిరిసిల్లటౌన్: సీఎం సభలో వివిధ కులాల సంఘం ప్రతినిధులు బీఆర్ఎస్‌కు మద్దతుగా ఏకగ్రీవ తీర్మానాలు ప్రకటించడానికి పలువురు వ్యతిరేకించారు. బుధవారం సిరిసిల్లలో ఈ అంశం రాజకీయంగా వివాదమైంది. స్థానిక విద్యానగర్‌లోని రెడ్డి సంఘంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు, పలువురు ప్రతినిధులు రెడ్డిసంఘం జిల్లా అధ్యక్షుడు కూర అంజిరెడ్డి తీరును ప్రశ్నిస్తూ నిరసన తెలిపారు. తమకు ఎలాంటి సమాచారం లేకుండా ఏకాభిప్రాయంతో సీఎం సభలో రెడ్డిసంఘం మద్దతును తీర్మానించినట్లు ప్రకటించడాన్ని తప్పుబట్టారు.

ప్రెస్‌క్లబ్‌లో వేర్వేరుగా సమావేశాలు

సీఎం సభలో కుల సంఘాల తీర్మానాలు అంటూ పద్మశాలి సంఘం, మున్నూరుకాపు సంఘం బాధ్యులు ప్రకటించడాన్ని ఆయా కులసంఘాల ప్రతినిధులు వేర్వేరుగా ఖండించారు. ప్రెస్‌మీట్లో మాట్లాడుతూ ఇలాంటి రాజకీయాలు ఏమాత్రం సరికాదన్నారు. కులసంఘాల సభ్యులు మొత్తం అనుమతి లేకుండా ప్రకటనలు చేయడాన్ని తప్పుబట్టారు. గోనె ఎల్లప్ప, నాగుల శ్రీనివాస్, శీలం రాజు, శ్రీహరి, శ్రీనివాస్, సంగీతం సాయిరాం పాల్గొన్నారు.

స్వలాభం కోసం కులాన్ని తాకట్టుపెడతారా ?

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తన స్వలాభం కోసం ఒక పార్టీకి కులాన్ని తాకట్టు పెట్టడం సరికాదని ఏకపక్షంగా కులం మొత్తం బీఆర్ఎస్ పార్టీకి మద్దతు తెలుపుతూ ఎలా ప్రకటిస్తారని ముదిరాజ్ సంఘం మండలాధ్యక్షుడు వడిగె భామగారి పెద్దన్న ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారి తంగళ్లపల్లిలో ముదిరాజ్ నాయకులతో కలిసి ఆయన మాట్లాడుతూ కోడి అంతయ్య తన స్వలాభం కోసం బీఆర్ఎస్‌కు ముదిరాజ్ కులం ఏకగ్రీవంగా మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలపడాన్ని ఖండించారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించుతామని హెచ్చరించారు. ఈనెల 20న ముదిరాజుల జిల్లా సమావేశాన్ని ఏర్పాటు చేసి కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. జంగపల్లి శేఖర్, మునిగెల రాజు, చుక్క రాజశేఖర్, గుండెల్లి అనిల్, చందు, భాను, మల్లేశ్, నాగరాజు, సంతోష్, భిక్షపతి, రాజు తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో డిస్కమ్స్ బాస్కెట్‌బాల్ చాంపియన్ 'కరీంనగర్'

- వరుసగా పదోసారి విజేతగా రికార్డు సృష్టించిన ఉమ్మడి జిల్లా జట్టు


ట్రోఫీ అందుకుంటున్న ఉమ్మడి కరీంనగర్ జిల్లా జట్టు


కొత్తపల్లి(కరీంనగర్): తెలంగాణ రాష్ట్ర ఇంటర్ సర్కిల్ ట్రాన్స్‌కో డిస్కమ్స్ బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌లో అదుభత ప్రదర్శనతో ఉమ్మడి కరీంనగర్ జిల్లా జట్టు చాంపియన్‌గా నిలిచింది. టోర్నమెంట్ చరిత్రలో జట్టు వరుసగా పదోసారి విజేతగా నిలిచి రికార్డు సొంతం చేసుకుంది. హైదరాబాద్‌లో మూడురోజులుగా కొనసాగిన టోర్నమెంట్ బుధవారంతో ముగిసింది. ఉత్కంఠగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో మహబూబ్‌నగర్(వోఎంసీ) జట్టుపై గెలుపొంది ఎస్పీడీసీఎల్ సీజీఎం సాయిబాబా, మేడ్చల్ ఎస్ఈ రామ్మోహన్ చేతుల మీదుగా ట్రోఫీని అందుకున్నారు. జట్టు కెప్టెన్ ఈఎల్‌పీ రాజు, సభ్యులు సుధీర్ కుమార్, రాజ్ కుమార్, అనిల్ కుమార్, వినీత్ రెడ్డి, విశ్వతేజ, రమేశ్, రంగు వెంకట్ నారాయణ, వినీల్ రెడ్డి, మోయిన్‌పాషా, మేనేజర్ శ్రీధర్‌ను ఎస్ఈ వి.గంగాధర్, సత్యనారాయణ, బి.సుదర్శన్ అభినందించారు.

పొలిటికల్ కూలీలకు గిరాకీ

పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ఓ పార్టీ గతేడాది నుంచి విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేస్తోంది. ప్రచారంలో మందిమార్బలంతో కొంతహడావుడి చేయాలి. ఇందుకోసం రోజువారీగా కూలీలను వినియోగిస్తే.. ఖర్చుతడిసి మోపెడుతుందని నాయకులు భావించారు. ఇంకేముంది.. తాము ఎక్కడికి వెళ్లినా.. ధర్నాలు, ర్యాలీలు, ఇంటింటా ప్రచారం చేసినా.. తమతో సుమారు 100మంది అనుచరులు ఉండేలా పెయిడ్ కార్యకర్తలను నియమించుకుంటున్నారు. వారికి నెలవారీగా జీతభత్యాలు చెల్లిస్తూ వస్తున్నారు.

పెద్దపల్లిలో మరోపార్టీ ఎమ్మెల్యేగా అభ్యర్థిత్వం ఖరారుతో కుటుంబ సమేతంగా ఎన్నికల ప్రచారం హోరెత్తిస్తున్నారు. అయితే, వారితో పార్టీ కేడర్ తక్కువ, పెయిడ్ కార్యకర్తలు ఎక్కువగా కనిపిస్తున్నారు. జిల్లాలో ప్రస్తుతం వ్యవసాయకూలీలకు పనిలేకపోవడం, ఎన్నికల సీజన్ ప్రారంభంకావడంతో చాలామంది రోజువారీ కూలీలు ప్రచారానికి వెళ్తున్నారు. దీంతో గ్రామాల్లో జెండా మోసేకూలీలకు గిరాకీ పెరిగింది.

- జిల్లాలో ప్రచారం జోరు పెంచిన పార్టీలు
- ఇంటింటి ప్రచారం, ర్యాలీలతో హోరెత్తిస్తున్న వైనం
- లీడర్స్ వెంట క్యాడర్ పేరిట రాజకీయ కూలీలు
- పర్మినెంట్ కూలీలను ఏర్పాటు చేసుకుని నెలవారీ జీతాలు



సాక్షి, పెద్దపల్లి: ఎన్నికల పండుగ రావడంతో పొలిటికల్ కూలీలకు గిరాకీ పెరిగింది. ఎమ్మెల్యే అభ్యర్థి అంటే మినిమం పక్కన వందో, యాభయో మంది ఉండాలి. నేతల వెంట నడిచే కార్యకర్తల సంఖ్యను బట్టి ఆ నాయకుడి బలాన్ని అంచనా వేసే సంస్కృతి రాజకీయాల్లో ప్రస్తుతం కనిపిస్తోంది. దీంతో తమ ప్రచారంలో జనాలు వందమందికి తక్కువ కాకుండా ఉండేలా నేతలు చూసుకుంటున్నారు. దీంతో ఏ పార్టీ నేతల సమావేశాలు, ర్యాలీల్లో చూసినా జనం కిక్కిరిసి కనిపిస్తున్నారు. బలప్రదర్శనగా మారుతున్న ప్రచారసరళితో చాలామంది రోజువారీ కూలీలు కూడా ఆయా పార్టీల కార్యక్రమాలకు హాజరై ఉపాధి పొందుతున్నారు. పార్టీ జెండా పట్టుకుని కార్యక్రమంలో పాల్గొంటే, లేదా సమావేశంలో పాల్గొంటే రూ.300 నుంచి రూ.500 వరకు కూలిగా అందుతోంది. మగవాళ్లకైతే డబ్బుతోపాటు మందు, బిర్యానీ అదనంగా చెల్లిస్తున్నారు నేతలు.

ఖర్చులు తడిసి మోపెడు..

పార్టీ జెండా మోసేందుకు వచ్చే దినసరి కూలీలు సవాలక్ష కండీషన్లు పెడుతున్నారు. బహిరంగసభకు వస్తే ఎంతసేపు ప్రాంగణంలో కూర్చోవాలో ముందే చెబితే.. దానినిబట్టే వస్తున్నారు. నేతల ఆలస్యంతో సభ ఆలస్యమైతే.. ఇంకోవంద అదనంగా ఇస్తేకానీ సభపూర్తి అయ్యేవరకు ఉండటం లేదు. తక్కువ అమౌంట్ ఇచ్చినా, ఆలస్యమైనా కార్యకర్తలు తిరుగుముఖం పట్టడంతో నేతలు వారిని సముదాయించలేక తలలు పట్టుకుంటున్నారు.

తెలంగాణలో పర్యటన కొత్త అనుభూతి

- జిల్లాలో విదేశీ మహిళల యాత్ర
- ఉమ్మడి జిల్లాలో బైక్ రైడ్

జన్నారం: తెలంగాణ రాష్ట్రంలో బైక్ రైడ్ ద్వారా పర్యటించడం కొత్త అనుభూతిని ఇచ్చిందని విదేశీ మహిళలు పేర్కొన్నారు. పర్యటనలో భాగంగా హైదరాబాద్ నుంచి మోటార్‌సైకిళ్లపై వివిధ దేశాల మహిళలు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కుంటాల, కడెం ప్రాంతాల్లో పర్యటించారు. మంగళవారం రాత్రి మంచిర్యాల జిల్లా జన్నారంలోని హరిత రిసార్ట్‌లో కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్నారు. మండలంలోని గిరిజన గ్రామం మల్యాలలో మహిళలతో మాట్లాడారు. బతుకమ్మ ఆటను తిలకించారు. బుధవారం ఉదయం అటవీ డివిజన్‌లోని మైసమ్మకుంట, బైసన్‌కుంట ప్రాంతాల్లో పర్యటించి వరంగల్‌కు పయనమయ్యారు. యూఎస్‌ఏ, సింగాపూర్, యూరప్, థాయిలాండ్, ఆస్ట్రేలియా దేశాలకు చెందిన తొమ్మిది మంది మహిళలు అలిసన్ గ్రుస్ ప్రారంభించిన ఫ్రీ డబ్ల్యూ, ఒక ఫ్రెంచ్ మోటార్‌సైకిలిస్ట్, మహిళలకు ఆర్థిక అవకాశాలను అందించేందుకు అసాధారణమైన మోటార్‌బైక్ రైడింగ్ చేస్తున్నట్లు తెలిపారు. మోటారుసైకిళ్లపై



మోటారుసైకిళ్లపై మహిళలు

తెలంగాణలో పర్యటిస్తూ మహిళలను కలవడం, బతుకమ్మ సంబరాలు, పర్యాటక ప్రదేశాలను సందర్శించడం, కళాకారులు, చేనేత కార్మికులను కలుసుకోవడం కోసం తెలంగాణను ఎంపిక చేసుకున్నట్లు తెలిపారు.

బైక్ ర్యాలీ ఇలా..

మహిళా బైకర్ల తొమ్మిది రోజుల మోటార్ సైకిల్ యాత్ర మహబూబ్‌నగర్, వికారాబాద్, నిర్మల్, వరంగల్ జిల్లాలతోపాటు పోచంపల్లి మీదుగా హైదరాబాద్ వరకు సాగి అక్కడ బతుకమ్మ వేడుకలతో ముగుస్తుంది.



బహుమతి అందజేస్తున్న విదేశీ మహిళ

సంప్రదాయాలు నచ్చాయి..



తెలంగాణ రాష్ట్రంలో పర్యటించడం, జన్నారంలో అడవుల అందాలు తిలకించడం, గిరిజనులతో మమేకమై మాట్లాడడం కొత్త అనుభూతినిచ్చింది. గిరిజన మహిళల బతుకమ్మ ఆటలను తిలకించి కొందరికి బహుమతులు అందించాం. తెలంగాణ పర్యటనలో చాలా విషయాలు తెలుసుకున్నాం. సంస్కృతి, సంప్రదాయలు బాగా నచ్చాయి.

– పెన్ని, యూఎస్‌ఏ

అట్టహాసంగా యోగాసన పోటీలు ప్రారంభం

- 15 జిల్లాల నుంచి 700 మంది క్రీడాకారుల హాజరు

కరీంనగర్‌స్పోర్ట్స్: తెలంగాణ యోగా సంఘం, కరీంనగర్ జిల్లా యోగా సంఘం ఆధ్వర్యంలో కరీంనగర్ పద్మనగర్‌లోని మానేరు సెంట్రల్ స్కూల్లో బుధవారం 10వ రాష్ట్రస్థాయి యోగాసన స్పోర్ట్స్ ఛాంపియన్షిప్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు తెలంగాణ వ్యాప్తంగా 15 జిల్లాల నుంచి సుమారు 700 మంది క్రీడాకారులు, 60 మంది కోచ్, మేనేజర్, టెక్నికల్ అఫీషియల్‌లో హాజరయ్యారు. 8 సంవత్సరాల నుంచి మొదలుకొని 45 సంవత్సరాల్లోపుతో పాటు 45కు పైగా ఉన్నవారికి పురుషులకు, మహిళలకు, బాలబాలికలకు వేరువేరుగా పోటీలను నిర్వహించారు. రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో అద్వితీయ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను నవంబర్ 23 నుంచి 26 వరకు అస్సాం రాష్ట్రం గౌహతిలో జాతీయ స్థాయి యోగా పోటీలకు నిర్వాహకులు ఎంపిక చేశారు. అంతకుముందు ఉదయం ఈ పోటీలను మానేరు విద్యాసంస్థల అధినేత, ఉమ్మడి జిల్లా ఒలంపిక్ సంఘం ప్యాట్రన్ కదారి అనంతరెడ్డి, రాష్ట్ర యోగా సంఘం ప్రధాన కార్యదర్శి కె.మనోహర్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా అనంతరెడ్డి మాట్లాడుతూ.. దైనందిన జీవితంలో యోగాసనాలను ప్రతి ఒక్కరూ చేయాలన్నారు. మానేరు విద్యాసంస్థలు క్రీడలకు, క్రీడా పోటీల నిర్వహణకు ఎల్లప్పుడు ముందుంటుందని, ప్రతీ సంవత్సరం ఏదో ఒక క్రీడలో రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి మనోహర్ కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయి యోగా పోటీలకు కరీంనగర్ జిల్లా నాలుగోసారి ఆతిథ్యం ఇవ్వడం హర్షించదగ్గ విషయమన్నారు. యోగాకు కేరాఫ్ అడ్రస్‌గా కరీంనగర్ జిల్లా మారిందని, ఇక్కడి క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో రాణించడం అభినందనీయమన్నారు. జిల్లా ఒలంపిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి జనార్దన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు తుమ్మల రమేష్ రెడ్డి, యోగా సంఘం జిల్లా కార్యదర్శి నాగిరెడ్డి సిద్ధారెడ్డి, ఉపాధ్యక్షుడు కన్నకృష్ణ, రాష్ట్ర యోగ సంఘం బాధ్యులు కమలాకర్ బాలరాజుతోపాటు కోచ్‌లు, మేనేజర్లు పాల్గొన్నారు.



యోగా క్రీడాకారులతో మనోహర్ కుమార్, మానేరు విద్యాసంస్థల అధినేత కదారి అనంతరెడ్డి



క్రీడాకారుడి యోగాసనం

అబ్బురపరిచిన యోగాసనాలు

రాష్ట్రస్థాయి యోగా పోటీల సందర్భంగా వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు చేసిన యోగా విన్యాసాలు అబ్బురపరిచాయి. ముఖ్యంగా 8 నుంచి 10 సంవత్సరాల చిన్నారులు, 45 సంవత్సరాల వయసు పైబడిన మహిళలు, పురుషుల యోగాసనాలు ఆకట్టుకున్నాయి.

తొలిరోజు విజేతలు వీరే..

8 నుంచి 10 సంవత్సరాల బాలికల విభాగంలో సిహెచ్ నితిగ్న చౌదరి, రంగారెడ్డి(ప్రథమ) అభిలాష రెడ్డి, నల్గొండ(ద్వితీయ) చేరుబ అమరిస్, నిజామాబాద్(తృతీయ) స్థానాల్లో నిలిచారు. బాలుర విభాగంలో చిన్మయ్ రెడ్డి(రంగారెడ్డి), కుష్వక్ రెడ్డి(హైదరాబాద్), మన్విత్ రామ్(కరీంనగర్) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నారు.

ఉద్యోగుల నిబద్ధతతోనే ప్రగతి పథం

- ఆర్టీసీ ఆర్‌ఎం సోలోమన్

ఆదిలాబాద్: ఉద్యోగుల నిబద్ధతే సంస్థను ప్రగతి పథంలో ముందుకు నడుపుతోందని ఆదిలాబాద్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సోలోమన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని డిపో గ్యారేజీలో బుధవారం ఏర్పాటు చేసిన సెప్టెంబర్ ఆదర్శ ఉద్యోగుల సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న సంస్థను లాభాల బాట పట్టించేలా నిరంతరం ఉద్యోగులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఉద్యోగులు, సిబ్బంది శ్రమ ఫలితంగానే ఇటీవల శ్రావణమాసం చాలెంజ్లో రాష్ట్రంలోనే ఆదిలాబాద్ రీజియన్ మూడో స్థానంలో నిలిచిందన్నారు. డిపో పరిధిలో నెలరోజులకు, జోనల్ పరిధిలో ఆరు నెలలకు, రాష్ట్రస్థాయిలో ఏడాదికి ఒకసారి ఉద్యోగుల పనితీరుపై అభినందన సభల ఏర్పాటు ఉంటుందన్నారు. ఇదే ఉత్సాహంతో పనిచేసి వందరోజుల గ్రాండ్ చాలెంజ్లో ఆదిలాబాద్ రీజియన్ మొదటి స్థానం సాధించేలా పాటుపడాలన్నారు. అనంతరం ఆర్‌ఎంను ఉద్యోగులు సన్మానించి, జ్ఞాపిక అందించారు. అలాగే దసరా పండుగ పురస్కరించుకొని డిపోలో పని చేస్తున్న స్వీపర్లకు ఆర్‌ఎం చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్‌ఎంలు ప్రణీత్, ప్రవీణ్, డీఎం కల్పన, ఎంఎఫ్ రాజేందర్, సీఐ విశ్వనాథ్, రిజర్వేషన్ ఇన్‌చార్జి హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగులను సన్మానిస్తున్న ఆర్‌ఎం

నీడ కోసం పాట్లు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణంలోని కాలేజీ రోడ్డులో నిర్మించిన మాతాశిశు ఆరోగ్య కేంద్రం వద్ద ఒక్క చెట్టు కూడా లేకపోవడం, వాహనాల పార్కింగ్‌కు సరైన నీడ సదుపాయం లేకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అర కిలోమీటరు దూరంలోని రోడ్డు డివైడర్ల మధ్య ఉన్న చెట్ల నీడనే వాహనాలను నిలపాల్సి వస్తోంది. గర్భిణులను దూర ప్రాంతాల నుంచి ఎంసీహెచ్‌కు తరలించే 102 వాహనాలతోపాటు ఆలనా వాహనాలు సైతం ఎంసీహెచ్‌కు వచ్చి చెట్ల కింద పార్కింగ్ చేసి ఉంచాల్సిన పరిస్థితి నెలకొంది.



వాహనాలను చెట్ల నీడలో నిలిపిన దృశ్యం

బాసరలో భక్తుల రద్దీ



ప్రసాదం పంపిణీ చేస్తున్న సభ్యులు

భైంసా: బాసరలో నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. నాలుగోరోజు బుధవారం అమ్మవారి దర్శనానికి భక్తులు భారీగా తరలివచ్చారు. గోదావరిలో పుణ్యస్నానాలు చేశారు. గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత ప్రత్యేక క్యూలైన్‌లో సరస్వతీ అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం చిన్న పిల్లలతో అక్షరాభ్యాస పూజలు జరిపించారు. భక్తులకు మహారాష్ట్రలోని ధర్మాబాద్ వ్యాపార సంఘం సభ్యులు ప్రసాదం పంపిణీ చేశారు. లక్ష్మీకాంత్, మారుతిపటేల్‌తోపాటు పలువురు నవరాత్రి ఉత్సవాల్లో భక్తులకు ప్రసాదాలు పంపిణీచేస్తున్నారు. మరోవైపు నాందేడ్‌కు చెందిన జగదీశ్ మహారాజ్ గాడిపుర ఆధ్వర్యంలో నిత్యాన్నదానం చేస్తున్నారు. ఆలయ ఈవో విజయరామారావు నిత్యాన్నదానంలో భక్తులకు వడ్డించారు.



నిత్యాన్నదానంలో భక్తులు

విద్య, ఉద్యోగ సమాచారం

కృష్ణా జిల్లా ప్రభుత్వాసుపత్రుల్లో 52 పోస్టులు

మచిలీపట్నంలోని ఆరోగ్య వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ.. కాంట్రాక్ట్/ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన కృష్ణా జిల్లా ప్రభుత్వాసుపత్రుల్లో వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 52
» **పోస్టుల వివరాలు:** ఫిజియోథెరపిస్ట్–02, స్టాఫ్ నర్స్–24, మల్టీ రిహాబిలిటేషన్ వర్కర్–08, మెడికల్ ఆఫీసర్–10, ఎల్‌జీఎస్–04, సపోర్టింగ్ స్టాఫ్–03, సెక్యూరిటీ గార్డ్–01.
» **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, 10+2, సర్టిఫికేట్ కోర్సు,జీఎన్‌ఎం/బీఎస్సీ నర్సింగ్, బీపీటీ, ఎంబీబీఎస్ ఉత్తీర్ణులైఉండాలి.
» **వయసు:** 42 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** అకడమిక్ మెరిట్, పని అనుభవం, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి కార్యాలయం, పరాసుపేట, నాయర్ బడ్డీ సెంటర్, మచిలీపట్నం, కృష్ణా జిల్లా చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 20.10.2023.
» **వెబ్‌సైట్:** krishna.ap.gov.in

అనంతపురం జిల్లా ప్రభుత్వాసుపత్రుల్లో 56 పారా మెడికల్ పోస్టులు

అనంతపురం ఆరోగ్య వైద్య,కుటుంబ సంక్షేమ శాఖ..అనంతపురం జిల్లా ప్రభుత్వాసుపత్రుల్లో కాంట్రాక్ట్/ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన పారా మెడికల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 56
» **పోస్టుల వివరాలు:**ఫార్మసిస్ట్ గ్రేడ్2–02, ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్2–02, రేడియోగ్రాఫర్–01, థియేటర్ అసిస్టెంట్–08, ల్యాబ్ అటెండెంట్–02, పోస్ట్ మార్టమ్ అసిస్టెంట్–03, మెడికల్ రికార్డ్ అసిస్టెంట్/రికార్డ్ అసిస్టెంట్–02, జనరల్ డ్యూటీ అటెండెంట్ జీడీఏ/ఎంఎన్‌వో/ఎఫ్‌ఎన్‌వో–28, ఆఫీస్ సబార్డినేట్–01, ప్లంబర్–05, ఎలక్ట్రీషియన్–01, ఆడియో మెట్రీషియన్/ఆడియోమెట్రిక్ టెక్నీషియన్–01.
» **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, ఐటీఐ,డీఫార్మసీ, బీఫార్మసీ, డీఎంఎల్‌టీ, నర్సింగ్ ఆర్డర్లీ కోర్సు, డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 42 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** అకడమిక్ మెరిట్, పని అనుభవం, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును అనంతపురంలోని హాస్పిటల్ సర్వీసస్ జిల్లా కోఆర్డినేటర్ కార్యాలయంలోని నిర్దిష్ట కౌంటర్లలో అందజేయాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 21.10.2023.
» **వెబ్‌సైట్:** ananthapuramu.ap.gov.in

ప్రకాశం జిల్లాలో ఈ–డివిజనల్ మేనేజర్ పోస్టులు

ఒంగోలులోని కలెక్టర్, జిల్లా మెజిస్ట్రేట్ కార్యాలయం.. కనిగిరి రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఈ–డివిజనల్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 01
» **అర్హత:** బీసీఏ/బీఎస్సీ/బీఈ, బీటెక్/మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు ఇంగ్లిష్ కమ్యూనికేషన్ స్కిల్స్ కలిగి ఉండాలి. వయసు: 21 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.22,500 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ఒంగోలు కలెక్టర్ కార్యాలయంలో అందజేయాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 28.10.2023.
» **వెబ్‌సైట్:** prakasam.ap.gov.in

విజయనగరం జిల్లా హాస్పిటల్‌లో వివిధ ఉద్యోగాలు

విజయనగరంలోని డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్(డీసీహెచ్‌ఎస్), డిస్ట్రిక్ట్ హాస్పిటల్ ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన వివిధ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 08
» **పోస్టుల వివరాలు:** ఆడియో మెట్రీషియన్/ఆడియోమెట్రీ టెక్నీషియన్–02, జనరల్ డ్యూటీ అటెండెంట్–05, ఆఫీస్ సబార్డినేట్–01.
» **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, ఇంటర్మీడియట్, బీఎస్సీ(ఆడియాలజీ), డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి. **వయసు:** 42 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** అకడమిక్ మెరిట్, పని అనుభవం, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును అర్హత కలిగిన సర్టిఫికేట్ జిరాక్స్ కాపీలతో పాటు జిల్లా కోఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్, జిల్లా ఆసుపత్రి, విజయనగరం కార్యాలయంలో అందజేయాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 25.10.2023.
» **వెబ్‌సైట్:** https://vizianagaram.ap.gov.in

జెన్‌కోలో.. ఏఈ జాబ్స్

టీఎస్ జెన్‌కో 339 అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. బీటెక్ అర్హతతో ఈ ఉద్యోగాలకు పోటీపడొచ్చు. రాత పరీక్షలో మెరిట్ ఆధారంగా నియామకం ఖరారు చేస్తారు. జెన్‌కో పరీక్ష తేదీని కూడా ప్రకటించింది. ఈ నేపథ్యంలో.. టీఎస్ జెన్‌కో ఏఈ పోస్టుల వివరాలు, అర్హతలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం తదితర వివరాలు..

» 339 ఏఈ పోస్ట్‌లకు టీఎస్ జెన్‌కో నోటిఫికేషన్
» బీటెక్ ఉత్తీర్ణతతో పోటీ పడే అవకాశం
» డిసెంబర్ 3న రాత పరీక్ష
» రాత పరీక్షలో ప్రతిభ ఆధారంగా నియామకం

తెలంగాణ స్టేట్ పవర్ జనరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్.. టీఎస్ జెన్‌కోగా సుపరిచితం. రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి కార్యకలాపాలను నిర్వహించే ఈ సంస్థ.. మానవ వనరుల నియామకం విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. ప్రతి ఏటా ఆయా విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి ఎంపిక ప్రక్రియ చేపడుతోంది. తాజాగా.. అసిస్టెంట్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

నాలుగు బ్రాంచ్‌లు.. 339 పోస్ట్‌లు

- టీఎస్ జెన్‌కో తాజా నోటిఫికేషన్ ద్వారా మొత్తం నాలుగు బ్రాంచ్‌లలో 339 అసిస్టెంట్ ఇంజనీర్ పోస్ట్‌లు భర్తీ చేయనున్నట్లు ప్రకటించింది.
- అసిస్టెంట్ ఇంజనీర్(ఎలక్ట్రికల్)–జనరల్ రిక్రూట్‌మెంట్–145 పోస్ట్‌లు, లిమిటెడ్ రిక్రూట్‌మెంట్– 42 పోస్ట్‌లు.
- అసిస్టెంట్ ఇంజనీర్(మెకానికల్)–జనరల్ రిక్రూట్‌మెంట్–74 పోస్ట్‌లు; లిమిటెడ్ రిక్రూట్‌మెంట్–3 పోస్ట్‌లు.
- అసిస్టెంట్ ఇంజనీర్(ఎలక్ట్రానిక్స్)–జనరల్ రిక్రూట్‌మెంట్–25 పోస్ట్‌లు.
- అసిస్టెంట్ ఇంజనీర్(సివిల్)–జనరల్ రిక్రూట్‌మెంట్–1,లిమిటెడ్ రిక్రూట్‌మెంట్–49 పోస్ట్‌లు
- నాలుగు బ్రాంచ్‌లకు సంబంధించి లిమిటెడ్ రిక్రూట్‌మెంట్ పరిధిలో 94 పోస్ట్‌లు, జనరల్ రిక్రూట్‌మెంట్ విధానంలో 245 పోస్ట్‌లు అందుబాటులో ఉన్నాయి.

విద్యార్హతలు

- ఏఈ(ఎలక్ట్రికల్): ఎలక్ట్రికల్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ బ్రాంచ్‌తో బీటెక్ ఉత్తీర్ణులవ్వాలి. ■ ఏఈ(మెకానికల్): మెకానికల్ బ్రాంచ్‌తో బీటెక్ ఉత్తీర్ణత ఉండాలి.
- ఏఈ(ఎలక్ట్రానిక్స్): ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్(ఈసీఈ)/ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్/ఎలక్ట్రానిక్స్ అండ్ కంట్రోల్ ఇంజనీరింగ్/ ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ పవర్/పవర్ ఎలక్ట్రానిక్స్ బ్రాంచ్‌లలో ఏదో ఒక బ్రాంచ్‌తో బీటెక్‌లో ఉత్తీర్ణత సాధించాలి.

వయసు

జూలై 1, 2023 నాటికి 18–44 ఏళ్లు ఉండాలి. ఎస్సీ / ఎస్టీ/ ఓబీసీ(నాన్ -క్రీమీలేయర్)/ఈడబ్ల్యూఎస్ కేటగిరీ అభ్యర్థులకు గరిష్ఠ వయో పరిమితిలో అయిదేళ్ల సడలింపు ఇస్తారు.

వేతనం

తుది విజేతల జాబితాలో నిలిచి నియామకం ఖరారు చేసుకుంటే.. రూ.65,600–రూ.1,31,220 వేతన శ్రేణిలో ప్రారంభ వేతనం లభిస్తుంది.

ఎంపిక ఇలా

రాత పరీక్షలో మెరిట్ ఆధారంగా రిజర్వేషన్లు, లోకల్ కేడర్ తదితర నిబంధనలను అనుసరించి తుది జాబితా రూపొందిస్తారు. ఆ జాబితాలో నిలిచిన వారికి నియామకాలు ఖరారు చేస్తారు. ఆ క్రమంలో ఆయా కేటగిరీల వారీగా కనీస అర్హత మార్కుల నిబంధనను అమలు చేస్తారు. ఓసీ, ఈడబ్ల్యూఎస్, క్రీడాకారుల కేటగిరీకి చెందిన అభ్యర్థులు 40 శాతం మార్కులు; బీసీ అభ్యర్థులు 35 శాతం మార్కులు; ఎస్సీ/ఎస్టీ కేటగిరీ అభ్యర్థులు 30 శాతం మార్కులు; పీహెచ్ కేటగిరీ అభ్యర్థులు 30 శాతం మార్కులు సాధించాలి.

వంద మార్కులకు రాత పరీక్ష

- రాత పరీక్షను రెండు విభాగాలుగా 100 మార్కులకు నిర్వహిస్తారు.
- పార్ట్–ఎలో అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్న బ్రాంచ్‌కు సంబంధించిన సబ్జెక్ట్ నుంచి 80 మార్కులకు ప్రశ్నలు అడుగుతారు.
- పార్ట్–బీలో ఇంగ్లిష్, జనరల్ అవేర్‌నెస్, అనలిటికల్ అండ్ న్యూమరికల్ ఎబిలిటీ, తెలంగాణ హిస్టరీ, సంస్కృతి, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత నమోదైన అభివృద్ధి, బేసిక్ కంప్యూటర్ నాలెడ్జ్ అంశాల నుంచి 20 మార్కులకు ప్రశ్నలు ఉంటాయి. రాత పరీక్షకు కేటాయించిన సమయం రెండు గంటలు.
- పరీక్షను ఓఎంఆర్ విధానంలో నిర్వహిస్తారు.

రెండేళ్ల ప్రొబేషన్, శిక్షణ

నియామకం ఖరారైన వారికి రెండేళ్ల పాటు ప్రొబేషన్, శిక్షణ విధానాన్ని అమలు చేస్తారు. తొలి ఏడాదిని శిక్షణ సమయంగా, రెండో ఏడాదిని ప్రొబేషన్ పీరియడ్‌గా పరిగణిస్తారు. ప్రొబేషన్ నిబంధనలతోపాటు.. సర్వీస్ బాండ్‌ను కూడా టీఎస్ జెన్‌కో అమలు చేస్తోంది. నియామకం ఖరారు చేసుకున్న వారు ట్రైనింగ్, ప్రొబేషన్‌లకు కేటాయించిన రెండేళ్లతో కలిపి.. మొత్తం అయిదేళ్లపాటు జెన్‌కోలో విధులు నిర్వహిస్తామని సర్వీస్ బాండ్ ఇవ్వాల్సి ఉంటుంది.



ఎస్ఈ స్థాయికి చేరుకునే అవకాశం

టీఎస్ జెన్‌కోలో అసిస్టెంట్ ఇంజనీర్‌గా కొలువు దీరిన వారు.. భవిష్యత్తులో సూపరింటెండెంట్ ఇంజనీర్ స్థాయికి చేరుకునే అవకాశం ఉంటుంది. సర్వీసు నిబంధనలను అనుసరించి.. ఏఈ తర్వాత.. అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్, ఆ తర్వాత డివిజనల్ ఇంజనీర్, అనంతరం సూపరింటెండెంట్ ఇంజనీర్ స్థానాలకు పదోన్నతులు లభిస్తాయి. చీఫ్ ఇంజనీర్ స్థాయికి కూడా చేరుకోవచ్చు.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:అక్టోబర్ 29,2023
- రాత పరీక్ష తేదీ: డిసెంబర్ 3, 2023
- రాత పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, సికింద్రాబాద్, జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ పరిధిలో.
- వెబ్‌సైట్: www.tsgenco.co.in

రాత పరీక్షలో రాణించేలా

- **ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ అభ్యర్థులు..** ఎలక్ట్రికల్ మెటీరియల్స్, బేసిక్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ అండ్ బ్యాటరీస్, ఎలక్ట్రికల్ సర్క్యూట్స్,డీసీ మెషీన్స్, మెజరింగ్ ఇన్‌స్ట్రుమెంట్స్, ఏసీ మెషిన్స్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, పవర్ సిస్టమ్స్, ఎలక్ట్రికల్ ఇన్‌స్టాలేషన్ అండ్ ఎస్టిమేషన్, యుటిలైజేషన్ అండ్ ట్రాక్షన్, పవర్ ఎలక్ట్రానిక్స్‌కు, అనలాగ్ అండ్ డిజిటల్ ఎలక్ట్రానిక్స్, సిగ్నల్ ప్రాసెసింగ్, కంట్రోల్ సిస్టమ్, ఎలక్ట్రికల్ మెషీన్స్, పవర్ సిస్టమ్స్, పవర్ ప్లాంట్ ఇంజనీరింగ్, పవర్ ఎలక్ట్రానిక్స్ అండ్ డ్రైవ్స్, థర్మోడైనమిక్స్, హీట్ ట్రాన్స్‌ఫర్‌కు సంబంధించిన అన్ని అంశాలపై పరిపూర్ణ అవగాహన పొందాలి.
- **మెకానికల్ బ్రాంచ్ అభ్యర్థులు..** ఇంజనీరింగ్ మెకానిక్స్, మెకానిక్స్ ఆఫ్ మెటీరియల్స్, థియరీ ఆఫ్ మెషీన్స్, వైబ్రేషన్స్, థర్మోడైనమిక్స్, ఫ్లూయిడ్ మెకానిక్స్, హీట్ ట్రాన్స్‌ఫర్, ఇంజనీరింగ్ మెటీరియల్స్, క్యాస్టింగ్, ఫార్మింగ్, జాయింగ్ ప్రక్రియలపై అవగాహన ఏర్పరచుకోవాలి. అదే విధంగా.. కంప్యూటర్ ఇంటిగ్రేటెడ్ మాన్యుఫ్యాక్చరింగ్, ప్రొడక్షన్ అండ్ ప్లానింగ్ కంట్రోల్, ఇన్వెంటరీ కంట్రోల్, ఆపరేషన్స్ రీసెర్చ్ ఐసీ ఇంజన్స్, రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండీషన్, పవర్ ప్లాంట్ ఇంజనీరింగ్ తదితర అంశాలపై దృష్టి పెట్టాలి.
- **సివిల్ ఇంజనీరింగ్ అభ్యర్థులు..** ఇంజనీరింగ్ మెకానిక్స్, సాలిడ్ మెకానిక్స్, స్ట్రక్చరల్ అనాలిసిస్, బిల్డింగ్ మెటీరియల్ అండ్ కన్‌స్ట్రక్షన్ మేనేజ్‌మెంట్, ఫ్లూయిడ్ మెకానిక్స్, ఓపెన్ ఛానెల్ ఫ్లో, పైప్ ఫ్లో, హైడ్రాలజీ అండ్ వాటర్ రిసోర్సెస్ ఇంజనీరింగ్, వాటర్ సప్లై ఇంజనీరింగ్, వేస్ట్ వాటర్ మేనేజ్‌మెంట్, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, జియో టెక్నికల్ ఇంజనీరింగ్, ఎయిర్ పొల్యూషన్, సర్వేయింగ్, ట్రాన్స్‌పోర్టేషన్ ఇంజనీరింగ్, పవర్ ప్లాంట్ ఇంజనీరింగ్ విభాగాల్లోని అంశాల్లో దృష్టి పెట్టాలి.
- **ఎలక్ట్రానిక్స్ ఇంజనీర్ అభ్యర్థులు..** నెట్‌వర్క్స్, సిగ్నల్స్, సిస్టమ్స్, ఎలక్ట్రానిక్ డివైసెస్, అనలాగ్ సర్క్యూట్స్, డిజిటల్ సర్క్యూట్స్, కంట్రోల్ సిస్టమ్స్, కమ్యూనికేషన్స్, ఎలక్ట్రో మ్యాగ్నటిక్స్, బేసిక్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, మెటీరియల్స్ సైన్స్, పవర్ ప్లాంట్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ మెజర్‌మెంట్స్‌కు సంబంధించిన అంశాలపై దృష్టి పెట్టాలి.
- జనరల్ అవేర్‌నెస్ అండ్ న్యూమరికల్ ఎబిలిటీ కోసం ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ ప్రాధాన్యం ఉన్న కరెంట్ అఫైర్స్‌పై పట్టు సాధించాలి. తెలంగాణకు సంబంధించి ఆర్థిక, సామాజిక అభివృద్ధిపై దృష్టి సారించాలి. తాజాగా అమలవుతున్న అభివృద్ధి పథకాలను తెలుసుకోవాలి. తెలంగాణ ప్రాంత భౌగోళిక స్వరూపం, విశిష్టతలు తెలుసుకోవాలి. ముఖ్యంగా తెలంగాణకు సంబంధించిన చరిత్రపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. తెలంగాణ తొలి ఉద్యమ దశ నుంచి తెలంగాణ ఆవిర్భావం వరకు పలు ముఖ్యమైన అంశాలను ఔపోసన పట్టాలి.వీటితోపాటు తెలంగాణ సంస్కృతి, సామాజిక పరిస్థితులు, కళలు, సాహిత్యం వంటి అంశాలను కూడా చదవాలి.

ఇటీవల కాలంలో తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలపై అవగాహన ఏర్పరచుకోవాలి. అనలిటికల్ ఎబిలిటీ విషయంలో గ్రాఫ్స్, డేటా అనాలిసిస్ అంశాలను ప్రాక్టీస్ చేయాలి. పదో తరగతి స్థాయిలో ఇంగ్లిష్ గ్రామర్‌ను అభ్యసనం చేయాలి.

అన్వయ దృక్పథం

ప్రిపరేషన్ సమయంలో అభ్యర్థులు అప్లికేషన్ ఓరియెంటేషన్‌తో ముందుకు సాగాలి. ముఖ్యంగా సబ్జెక్ట్ విభాగానికి సంబంధించి బీటెక్ స్థాయిలోని అకడమిక్ పుస్తకాలను ఆలంబనగా చేసుకుని ప్రిపరేషన్ సాగించాలి. మోడల్ పేపర్లు, మాక్ టెస్ట్‌లు రాయడం కూడా పరీక్షలో మెరుగైన ప్రతిభ చూపేందుకు దోహదం చేస్తుంది.